క్లుప్తంగా

అన్నదానానికి వాసుపల్లి విరాళం



అన్నదాన కార్యక్రమానికి ఆర్థిక సాయం అందజేస్తున్న వాసుపల్లి

దాబాగార్డెన్స్: వినాయక ఉత్సవాలలో భాగంగా దక్షిణ నియోజకవర్గంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమాలకు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ దక్షిణ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ విరాళాలు అందించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో 30వ వార్డు, కోడి పందాల వీధిలోని 'ఐకానిక్ బాయ్స్' ఆధ్వర్యంలో నిర్వహించనున్న అన్నదాన కార్యక్రమానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ, పేదల కోసం చేపట్టే ఏ సేవా కార్యక్రమానికైనా తాను అండగా ఉంటానని తెలిపారు. దైవ కార్యంతో పాటు సేవా కార్యక్రమం కూడా ఉన్న ఈ అన్నదానంలో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందని ఆయన అన్నారు. కార్యక్రమంలో 30వ వార్డు అధ్యక్షుడు దశమంతుల మాణిక్యాలరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒంటరి మహిళలకు చేయూత



మహిళకు నగదు అందజేస్తున్న కార్పొరేటర్ కోడిగుడ్ల శ్రీధర్

కంచరపాలెం: దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని, జీవీఎంసీ 41వ వార్డులోని ఒంటరి మహిళలకు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు గడిచినా ఇప్పటి వరకు ఒంటరి మహిళలకు కొత్త పెన్షన్లు మంజూరు కాలేదని, అందుకే వారికి అండగా నిలవాలని ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా, పెన్షన్లు లేని ఒంటరి మహిళలకు నిత్యావసర సరకులతో పాటు రూ.3 వేలు అందజేశామన్నారు.

వివేకానంద సంస్థకు దోమల బ్యాట్లు పంపిణీ



దోమల బ్యాట్లు అందజేస్తున్న వాల్తేర్ రాయల్ రౌండ్ టేబుల్ సంస్థ ప్రతినిధులు

దాబాగార్డెన్స్: సేవా కార్యక్రమాల్లో చురుగ్గా ఉండే వాల్తేరు రాయల్ రౌండ్ టేబుల్ సంస్థ సోమవారం పాత నగరంలోని స్వామి వివేకానంద సంస్థలో ఉన్న నివాసితులు, సభ్యులకు దోమల బ్యాట్లను పంపిణీ చేసింది. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ వర్షాల కారణంగా దోమల తీవ్రత పెరిగిందని, దీనివల్ల ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో ఈ బ్యాట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రౌండ్ టేబుల్ సంస్థ సభ్యులు మక్సూద్ అహ్మద్, అరవింద్ గొల్లు, కళ్యాణ్ ఆదిత్య, రాజశేఖర్ గిడితూరి, జానకీరామ్ చిట్టూరి, కె. భరత్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ బహిరంగ క్షమాపణలు చెప్పాలి



నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

బీచ్‌రోడ్డు: బీహార్‌లో 'ఓటర్ అధికార్' యాత్ర సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తల్లిపై రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం విశాఖ బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఆశీల్ మెట్ట జంక్షన్ వద్ద ధర్నా నిర్వహించారు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నాయకులు బహిరంగ క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు పరుశురామరాజు, రాష్ట్ర కార్యదర్శి ఉమ్మిడి సుజాత రాజ్, రాష్ట్ర కోశాధికారి ఎం. నాగేంద్ర, రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ సుహాసిని ఆనంద్ పాల్గొన్నారు.

భారీ వాహనాలతో బెంబేలు



ఎర్నిమాంబ ఆలయం వద్ద టిప్పర్ లారీలు



కాన్వెంటు కూడలి నుంచి కంచరపాలెం వెళ్లే రహదారిలో టిప్పర్ లారీల రాకపోకలు ఇలా...

- నిషిద్ధ సమయాల్లో భారీ వాహనాల రాకపోకలు
- ప్రమాదాల బారిన పాదచారులు, ద్విచక్ర వాహనదారులు
- పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు



జ్ఞానాపురం రహదారులో రద్దీ

కంచరపాలెం: జీవీఎంసీ జోన్–5 పరిధిలోని జ్ఞానాపురం బీఆర్‌టీఎస్ రహదారిపై నిషిద్ధ సమయాల్లో కూడా భారీ వాహనాలు, టిప్పర్ లారీలు యథేచ్ఛగా తిరుగుతుండటం స్థానికులను ఆందోళనకు గురిచేస్తోంది. ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యం కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ వంతెన కూడలి నుంచి జ్ఞానాపురం మీదుగా, అలాగే కాన్వెంట్ కూడలి నుంచి చావుల మదుం వైపు భారీ వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటున్నాయి. ఈ మార్గంలో సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల, సెక్రెడ్ హార్ట్ బాలికల ఉన్నత పాఠశాల, జూబ్లీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల వంటి అనేక విద్యాసంస్థలు ఉన్నాయి. ఇక్కడికి ప్రతిరోజూ వేలాది మంది విద్యార్థులు, అలాగే జ్ఞానాపురం రైల్వే స్టేషన్ ప్రయాణికులు, రక్షణగిరి, ఎర్నిమాంబ దేవస్థానాల భక్తులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ వాహనాల వేగానికి కళ్లెం వేయడానికి ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లను కూడా టిప్పర్ లారీలు పట్టించుకోవడం లేదు. ఇటీవల కాన్వెంట్ కూడలి వద్ద భారీ వాహనాల వల్ల జరిగిన ప్రమాదాల్లో పలువురు మరణించడం, గాయపడటం జరిగింది. ప్రమాదాలు జరిగాక స్పందించే బదులు, ముందే అప్రమత్తమై నిషిద్ధ సమయాల్లో వాహనాల రాకపోకలను నియంత్రించాలని స్థానికులు, విద్యార్థులు, ద్విచక్ర వాహనదారులు కోరుతున్నారు. భారీ వాహనాల డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చి, ప్రమాదాలను నివారించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

అధికారులు స్పందించాలి

జ్ఞానాపురం బీఆర్‌టీఎస్ రహదారిలో నిత్యం వేల సంఖ్య ప్రజలు, వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. నిషిద్ధ సమయంలో భారీ వాహనాలు, టిప్పర్ లారీ రాకపోకలు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు భారీ వాహనాలను నియంత్రించడానికి రక్షణ చర్యలు తీసుకోవాలి.

– బోరా మహేంద్ర, జ్ఞానాపురం

అధికారులపై అక్రమ కేసులు అన్యాయం

వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్ వెస్లీ



సీతంపేట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పనిచేసిన ఉన్నతాధికారులపై కూటమి ప్రభుత్వం కక్ష సాధిస్తోందని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బొల్లవరపు జాన్‌వెస్లీ ఆరోపించారు. కొందరు అధికారులను సస్పెండ్ చేస్తూ, మరికొందరికి పోస్టింగ్ ఇవ్వకుండా వేధిస్తున్నారని మండిపడ్డారు. లలితానగర్‌లోని తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

సుమారు 190 మందికి పైగా పోలీసు ఉన్నతాధికారులను పోస్టింగ్ లేకుండా ఖాళీగా ఉంచారని, 16 మంది ఐపీఎస్ అధికారులను డీజీపీ కార్యాలయానికే పరిమితం చేశారని విమర్శించారు. దీని వల్ల కూటమి ప్రభుత్వానికి పోలీసు వ్యవస్థపై గౌరవం లేదని స్పష్టమవుతోం దన్నారు. దళిత క్రైస్తవ అధికారి సంజయ్‌ను ఎలాంటి పోస్టింగ్ ఇవ్వకుండా, గత ప్రభుత్వంలో జరిగిన అగ్నిమాపక పరికరాల కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ అరెస్టు చేయడం అన్యాయమని జాన్‌వెస్లీ పేర్కొన్నారు. ఈ కేసులో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బంధువైన వెంకటరమణ చౌదరికి అడిషనల్ డీజీగా పదోన్నతి కల్పించడంపై ఆయన అనుమానం వ్యక్తం చేశారు. అధికారుల సస్పెన్షన్, అరెస్టుల వల్ల రాష్ట్రంలో భయానక వాతావరణం ఏర్పడిందని, ఇది శాంతిభద్రతల సమస్యకు దారితీస్తుందని జాన్‌వెస్లీ హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ఈ కక్షపూరిత చర్యలు మంచివి కాదని ఆయన అన్నారు.

'హిందూజా' కాలుష్యం నుంచి కాపాడాలి



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న హిందూజా భూ నిర్వాసితులు

మహారాణిపేట : పెదగంట్యాడ మండలం పాలవలసలో ఉన్న హిందూజా సంస్థ కాలుష్యం వల్ల బాధపడుతున్న ఐదు గ్రామాల ప్రజలు సోమవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. తాము ఉంటున్న గ్రామాల నుంచి తక్షణం తరలించాలని ప్లకార్డులు చేతబూని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాసితుల సంఘం అధ్యక్షుడు కాకి అప్పలరెడ్డి మాట్లాడుతూ హిందుజా పరిశ్రమ నుంచి వెలువడుతున్న కాలుష్యం వల్ల పాలవలస, దేవాడ, నక్కవానిపాలెం, గొల్లపేట, పలికిలదొడ్డి గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీంతో తరచూ అనారోగ్యాలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై గతంలోనూ పలుమార్లు వినతిపత్రాలు సమర్పించినా ఎవరూ స్పందించలేదని ఆయన అన్నారు. పరిశ్రమ కాలుష్యాన్ని నియంత్రించి, తమను ఆదుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు మరోసారి వినతిపత్రాన్ని అందజేశారు.

ప్రమోషన్ల కోసం హెల్త్ సెక్రటరీల ఆందోళన



నిరసన చేస్తున్న హెల్త్ సెక్రటరీలు

బీచ్‌రోడ్డు: ఏపీ యునైటెడ్ గ్రామ, వార్డు హెల్త్ సెక్రటరీల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద హెల్త్ సెక్రటరీలు సోమవారం ఆందోళన చేపట్టారు. ప్రమోషన్లు కల్పించాలని, రీ-డిప్లాయ్‌మెంట్ రద్దు చేయాలని, జీవో ప్రకారం పనివేళలు, సెలవులు అమలు చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్ మాట్లాడుతూ గత సంవత్సర కాలంగా ప్రమోషన్ల కోసం హెల్త్ సెక్రటరీలు పలుమార్లు డీఎంహెచ్‌వోకు విన్నవించుకున్నా ఫలితం లేకపోవడంతోనే ఆందోళన చేపట్టాల్సి వచ్చిందన్నారు. గత 25న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు ఫిర్యాదు చేసినప్పుడు.. వారం రోజుల్లో ప్రమోషన్లు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆందోళనకు స్పందించిన డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు వారిని చర్చలకు ఆహ్వానించారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఒకేషనల్ ఏఎన్‌ఎం ట్రైనింగ్ సర్టిఫికెట్ల జెన్యూనిటీ వెరిఫికేషన్ మూడు రోజుల్లో పూర్తి చేసి, మరో రెండు రోజుల్లో ప్రమోషన్లు ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని హామీ ఇచ్చారు. అలాగే సచివాలయం హెల్త్ సెక్రటరీలకు రీ-డిప్లాయ్‌మెంట్ నుంచి మినహాయిస్తున్నట్లు తెలిపారు. పనివేళలు, సెలవులు తప్పకుండా చట్ట ప్రకారం అమలు చేస్తామన్నారు. ఆయన హామీ మేరకు హెల్త్ సెక్రటరీలు ఆందోళన విరమించారు. యూనియన్ రాష్ట్ర కోశాధికారి చుక్కల సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి కృష్ణమోహన్, అసోసియేషన్ గౌరవ అధ్యక్షురాలు పి. మణి, అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దేవకి, రత్నం, విశాఖ జిల్లా అధ్యక్షురాలు సుభాషిని తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో దీపారాధన



కుమ్మరవీధిలో దీపారాధనలో పాల్గొన్న మహిళా భక్తులు

అల్లిపురం: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా కుమ్మరవీధి రామాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద సోమవారం సాయంత్రం దీపారాధన చేపట్టారు. కార్యక్రమంలో మహిళలు ఉత్సాహంగా పాల్గొని 108 దీపాలను భక్తి శ్రద్ధలతో వెలిగించారు. ఈ సందర్భంగా వినాయకునికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన పూజ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజ ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు జరుగుతుంది. పూజలో పాల్గొనాలనుకునే భక్తులు రూ.1,116 చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు. మరింత సమాచారం కోసం 0891–2711725 లేదా 2566514 నంబర్లను సంప్రదించవచ్చు.

సివిల్స్ పరీక్షలకు ప్రిపరేషన్‌పై వర్క్‌షాప్

మద్దిలపాలెం : ప్రఖ్యాత టెడ్‌ఎక్స్ స్పీకర్, లైఫ్ కోచ్ అనిరుధ్ బిల్లా ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ విభాగంలో సివిల్ సర్వీసెస్‌కు ప్రిపరేషన్‌పై సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. వివిధ విభాగాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిరుధ్ మాట్లాడుతూ సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సంబంధించిన విలువైన సమాచారం అందించారు. పరీక్షలకు అనుసరించాల్సిన వ్యూహాలు, సమయ నిర్వహణ పద్ధతులు తెలిపారు. అనంతరం ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.నరసింహారావు మాట్లాడుతూ నిర్వాహకులను అభినందించారు. విద్యార్థులకు మార్గదర్శకంగా ఇటువంటి సెషన్లు నిలుస్తాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగాధిపతి ప్రొఫెసర్ పెలేటి ప్రేమానందం పాల్గొన్నారు.

పరిశోధన పత్రాల సంకలనాలు ఆవిష్కరణ

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సోషల్ ఇన్‌క్లూజన్ (సీఎస్ఎస్ఐ) డైరెక్టర్ డాక్టర్ పి.సుబ్బారావు సంపాదకత్వం వహించిన రెండు పుస్తకాలను (పరిశోధన పత్రాల సంకలనాలను) వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. సోషల్ ఇన్‌క్లూజన్ అండ్ ఎంపవర్మెంట్ ఆఫ్ డిజెడ్వాంటేజ్ కమ్యూనిటీస్ ఇన్ ఇండియా అనే సెమినార్‌లో సమర్పించిన పరిశోధన పత్రాలను పుస్తక రూపంలో తీసుకొచ్చారు. మొదటి పుస్తకంలో 16 పరిశోధన పత్రాలు, రెండో పుస్తకంలో భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యావేత్తలు, పండితులు సెమినార్‌లో సమర్పించిన 12 పత్రాలు ఉన్నాయని వీసీ రాజశేఖర్ తెలిపారు.

బాల్యం విద్యకు దూరం కాకుండా చూడాలి

మద్దిలపాలెం: ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్యకు వెళ్లే క్రమంలో బడి మానేసే విద్యార్థుల సంఖ్యను తగ్గించేందుకు కృషి చేయాలని ఎన్‌సీటీఈ-ఆర్‌సీఐ ఇన్‌స్పెక్షన్ కమిటీ సభ్యురాలు, ఆచార్యురాలు డాక్టర్ టి.జి.అమృతవల్లి పిలుపునిచ్చారు. ఆంధ్రా యూనివర్సిటీలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సీఆర్‌ఈ శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అమృతవల్లి మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన (దివ్యాంగ) విద్యార్థులు కూడా సాధారణ విద్యార్థులతో కలిసి చదువుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. పాఠశాలల్లో దివ్యాంగులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, ఉపాధ్యాయులు వారి అభ్యాసన స్థాయిని నిరంతరం గమనించాలని కోరారు. చదవడం, రాయడం, ప్రాథమిక గణిత అంశాలపై విద్యార్థులకు పట్టు ఉండేలా చూడాలని వివరించారు. ఆచార్య ఎన్.విజయమోహన్ మాట్లాడుతూ చిన్నారులందరికీ సమాన అవకాశాలు అందించడమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. పాఠశాల విద్య విభాగం ఆర్జేడీ వి.విజయభాస్కర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల కోసం జాతీయ విద్యా విధానం రూపొందించబడిందని, మండలానికి ఒక ప్రత్యేక పాఠశాల ఏర్పాటు చేస్తే వారి అవసరాలకు అనుగుణంగా విద్య అందించవచ్చని తెలిపారు. ఏయూ విద్యా విభాగాధిపతి ఆచార్య షారోన్ రాజు మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో దివ్యాంగులకు బోధించేటప్పుడు ఎదురైన సమస్యలను తెలియజేస్తే, వాటిని ఆర్‌సీఐ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రకాష్, డాక్టర్ ఆలీ, డాక్టర్ రాములు తదితరులు పాల్గొన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్నవారికి సర్టిఫికెట్లు అందజేశారు.

11 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

తాటిచెట్లపాలెం: ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న 11 మందిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.72 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ద్వారకా పోలీసులు తెలిపిన వివరాలివి.. ద్వారకానగర్‌లోని సుబ్బయ్య హోటల్ పై అంతస్తులో సోమవారం కొంతమంది పేకాట ఆడుతున్నారనే సమాచారం టాస్క్‌ఫోర్స్ పోలీసులకు అందింది. వెంటనే వారు దాడి చేసి, పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వారిని ద్వారకా పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు సీఐ డి.వి.రమణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'మిస్ విశాఖ' పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏయూ క్యాంపస్: 'మిస్ విశాఖ 2025'పోటీలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు నిర్వాహకుడు అజయ్ అగర్వాల్ తెలిపారు. ఇప్పటికే వందకు పైగా దరఖాస్తులు వచ్చాయని, ఇంకా ఎక్కువ దరఖాస్తులు వస్తాయని ఆశిస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సెప్టెంబర్‌లో ఆడిషన్స్ నిర్వహిస్తామని, నవంబర్‌లో 'మిస్ విశాఖ 2025'గ్రాండ్ ఫినాలే జరుగుతుందని వివరించారు. ఈ పోటీల్లో పాల్గొనడానికి ఆసక్తి ఉన్నవారు www.instagram.com/missvizag2025/ పేజ్‌లో మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చు. కాగా.. నగరానికి చెందిన డాక్టర్ సృజన దేవి త్వరలో రాజస్థాన్‌లో జరగనున్న 'మిస్ ఇండియా' పోటీలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఆమెను 'ఫరెవర్ మిస్ ఇండియా'కిరీటంతో సత్కరించామని, 'మిస్ విశాఖ'గా ఎంపిక కాలేదని స్పష్టం చేశారు.

సీఐటీయూ మహాసభల ప్రచార గీతాల ఆవిష్కరణ



ప్రచార గీతాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న బాబీ వర్ధన్, సీహెచ్ నరసింగరావు, గాయకుడు రాంకీ

దాబాగార్డెన్స్: విశాఖలో తొలిసారిగా జరగనున్న సీఐటీయూ 18వ అఖిల భారత మహాసభల సందర్భంగా, సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ రూపొందించిన ప్రచార గీతాలను ప్రముఖ గాయకుడు రాంకీ వెలగాడ ఆలపించారు. ఈ పాటల ఆడియోను సోమవారం సీఐటీయూ కార్యాలయంలో ఏయూ జర్నలిజం విభాగం మాజీ హెచ్‌వోడీ బాబీ వర్ధన్, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్. నర్సింగరావు, గాయకుడు రాంకీ వెలగాడ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాబీవర్ధన్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కార్మికుల హక్కుల కోసం సీఐటీయూ పోరాడుతోందని, ముఖ్యంగా విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల ద్వంద్వ వైఖరిని ప్రజలు గుర్తించాలని ఆయన సూచించారు. ఈ మహాసభలు కార్మికుల సమస్యలను జాతీయ స్థాయిలో చర్చించడానికి ఉపయోగపడతాయని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు మాట్లాడుతూ ఈ మహాసభలకు దేశవ్యాప్తంగా 1,500 మంది ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు. కార్మిక వ్యతిరేక విధానాలు, ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడులపై ఈ సభల్లో చర్చిస్తామని ఆయన వివరించారు. ఈ సభలను జయప్రదం చేయడానికి ప్రజల సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, కోశాధికారి ఎస్.జ్యోతీశ్వరరావు, ఉపాధ్యక్షుడు కె.ఎం.కుమార్‌మంగళం, బి.జగన్, పి.మణి పాల్గొన్నారు.

11న ఉక్కు ప్రైవేటీకరణపై బహిరంగ సభ



సమావేశంలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

దాబాగార్డెన్స్: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలను అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ, సీపీఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి 11వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ప్రచారం, 11న పాత గాజువాకలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తెలిపారు. సోమవారం సీపీఎం కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 'ఈఓఐ' (ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంట్రెస్ట్) పేరుతో విశాఖ ఉక్కులోని 46 కీలక విభాగాలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఈఓఐ రద్దుపై ప్రకటన చేయకపోవడం దారుణమని విమర్శించారు. దీనిపై ప్రజలను చైతన్యం చేసేందుకు పాదయాత్రలు, కరపత్రాల పంపిణీ, గేట్ మీటింగ్‌లు వంటి ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఈ పోరాటంలో ప్రజలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

చిరస్మరణీయుడు రామచంద్రమూర్తి



నివాళులర్పిస్తున్న సమితి చైర్మన్ వెంకట్రావు తదితరులు

దాబాగార్డెన్స్: జడ్జికోర్టు సమీపంలో ఉన్న ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి కార్యాలయంలో సోమవారం, బ్రహ్మశ్రీ ఇంద్రగంటి రామచంద్రమూర్తి ప్రథమ వర్ధంతి సందర్భంగా సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి చైర్మన్ వెంకట్రావు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ ఇంద్రగంటి రామచంద్రమూర్తి ఆధ్యాత్మిక కార్యక్రమాలలో, సేవా కార్యక్రమాలలో విశేష కృషి చేశారని కొనియాడారు. ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి స్థాపనలో ఆయన కీలక పాత్ర పోషించారని, గౌరవ అధ్యక్షుడిగా సమితికి ఎనలేని సేవలు అందించారని తెలిపారు. కార్యక్రమంలో సమితి కార్యదర్శి పి.జగన్మోహనరావు, సంయుక్త కార్యదర్శి వి.మధుసూధనరావు, ఎం.నాగేశ్వరరావు, అలాగే ఇంద్రకంటి రామచంద్రమూర్తి గారి కుటుంబ సభ్యులు, శిష్యులు, సంగీత అభిమానులు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు ఎమ్మెల్సీ, జెడ్పీ చైర్‌పర్సన్ పరామర్శ



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శిస్తున్న జెడ్పీ చైరపర్సన్ సుభద్ర



కేజీహెచ్ వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు

మహారాణిపేట: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు చింతలవీధిలో వినాయక నిమజ్జనం ఊరేగింపులో స్కార్పియో వాహనం ఢీకొనడంతో గాయపడిన వారిని ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు, ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లపల్లి సుభద్ర పరామర్శించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని వారు కేజీహెచ్ వైద్యులను కోరారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులను కుంభా రవిబాబు పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం నిలకడగా ఉన్న వంతల దాలిమా సర్జరీని పర్యవేక్షించి, ఆమె త్వరగా కోలుకునేలా చూడాలని వైద్యాధికారులకు సూచించారు. అదే ప్రమాదంలో గాయపడిన వంతల దాలిమా, కొర్ర విశ్వలను జల్లపల్లి సుభద్ర పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. హార్ట్ స్ట్రోక్‌తో బాధపడుతున్న దోడుపుట్టు సర్పంచ్ తండ్రి చందూర్ ను కూడా ఆమె పరామర్శించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ, ట్రైబల్ సెల్ వైద్యాధికారి డాక్టర్ సంపత్‌లను రవిబాబు, సుభద్ర కోరారు.

సంతృప్తికరంగా సేవలు అందించా..



ఆచార్య ధనుంజయరావు సత్కరిస్తున్న ఏయూ వీసీ

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయానికి రిజిస్ట్రార్‌గా ఏడాది కాలం పాటు సేవలందించడం ఎంతో గర్వకారణమని, ఈ అవకాశం తనకు కల్పించిన వీసీకి, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ఆచార్య ఇ.ఎన్ ధనుంజయరావు అన్నారు. రిజిస్ట్రార్‌గా రిలీవ్ అవుతున్న ఆయనకు అకడమిక్ సెనెట్ మందిరంలో సోమవారం ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఆచార్య ధనంజయరావు మాట్లాడుతూ ఏడాది కాలం రిజిస్ట్రార్ సంతృప్తికరమైన సేవలు అందించానని చెప్పారు. ఈ సమయంలో ఎంతో నేర్చుకున్నానని, ఎన్నో సవాళ్లతో కూడుకున్న బాధ్యతగా రిజిస్ట్రార్ పదవి నిలుస్తుందని చెప్పారు. ఏయూ వీసీ రాజశేఖర్ మాట్లాడుతూ రిజిస్ట్రార్‌గా కొనసాగాలని ధనుంజయరావును తాను కోరానని... అయినా రిలీవ్ కావాలని భావించడంతో తప్పనిసరి పరిస్థితులలో వీడ్కోలు పలకాల్సి వస్తోందన్నారు. మంచి పరిపాలనదక్షుడిగా ధనుంజయరావు నిలుస్తారని కొనియాడాను. రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్ బాబు మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి వెలకట్టలేని సేవలను ధనుంజయరావు అందించాలని కొనియాడారు. ధనుంజయరావును వీసీ రాజశేఖర్ సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు ఆచార్య ఎం.వి.ఆర్ రాజు, డి.నగరాజాకుమారి, ఆర్.పద్మశ్రీ. ఫ్యాకల్టీ అఫైర్స్ డీన్ ఆచార్య కె.రాంబాబు, అకడమిక్ డీన్ ఆచార్య శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.